క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మిడుతూరు: మండల పరిధిలోని ఎస్‌ఆర్‌బీసీ కాలువ వద్ద అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ తదితర పూజలను వేదపండితులు కుమార శర్మ, తదితరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహం పక్కనే సుబ్రమణ్యేశ్వర స్వామి, గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కుమారస్వామికి విశేషపూజలు



ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మిడుతూరు: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ ఓబులేసు హెచ్చరించారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం సమీపంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటోలో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోరాదన్నారు. సరైన పత్రాలు లేని 19 మందికి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. హెడ్‌కానిస్టేబుళ్లు బాలాజీసింగ్, గోవిందు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత కార్యక్రమం



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై ఒంగోలుకు చెందిన రాఘవ సంగీత కూచిపూడి నృత్య నికేతన్ వారి భక్తి సంగీత కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో భాగంగా గణపతి నమో నమః, శివ శివ, బ్రహ్మమురారిసురార్చితలింగం, కాశీవిశ్వనాథాష్టకం, శివాష్టకం, శివస్తోత్రం మొదలైన గీతాలు, అష్టకాలను సాయిశరణ్య, హారిక, జోషిత ఆలపించారు. కార్యక్రమానికి మృదంగం కృష్ణమోహన్, వయోలిన్ సహకారాన్ని సి.శ్రీనివాస్ అందించారు.

చెంచుగూడెంలో సంచార చికిత్స



బాలింతకు వైద్య సూచనలిస్తున్న వైద్యాధికారి గోపాల్

ఆత్మకూరు: మండలంలోని నాగలూటి చెంచు గూడెంలో మంగళవారం 104 సంచార చికిత్స కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బైర్లూటీ వైద్యాధికారి గోపాల్ గూడెంలో ఇంటింటికీ తిరిగి గర్భిణులు, బాలింతలను పరీక్షించి అవసరమైన మందులు అందజేసి, పలు సూచనలిచ్చారు. గూడెంలో చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. గర్భిణులు ఆకుకూరలు, చేపలు, గుడ్లు, మాంసం తినాలని, తప్పనిసరిగా ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దీపికా బాయి, ఆరోగ్య కార్యకర్తలు బేబిజ్యోతి, భాస్కర్, విశ్వనాథ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చీల ముస్తాబు

పగిడ్యాల: మండలంలోని పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పడమర వనుములపాడు, బీరవోలు, సంకిరేణిపల్లె, పగిడ్యాల, కొత్త పాలమర్రి, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ఎం.ఘణపురం గ్రామాల్లోని ప్రార్థన మందిరాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

నందికొట్కూరు: మండలంలో క్రిస్మస్ సందడి నెలకొంది. మంగళవారం ఆయా చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఏసు జననానికి సంబంధించిన పశువుల పాకను ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

సెమీ క్రిస్మస్ వేడుకలు

కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లె గ్రామంలోని రాజేశ్వరి పాఠశాలలో మంగళవారం మేరీ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం గుణంపల్లి వాసుదేవరెడ్డి, కరస్పాండెంట్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన క్రీస్తు జననం నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

నందికొట్కూరు: స్థానిక సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు, బీబీ, లక్ష్మీదేవి, మల్లేశ్వరమ్మ, రాణెమ్మ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బేగం, నవ్య, రిజ్వాన, మల్లేశ్వరమ్మ, సరోజమ్మ, షెక్షావలి, సోమన్న, మాదన్న, అన్వర్‌బాషా, ఏసన్న, మాధవ నాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





పగిడ్యాల: విద్యుత్ కాంతుల్లో దేవనగర్ కాలనీలోని ఏబీఎం చర్చి, ఇందిరానగర్‌లోని సీఎస్‌ఐ ప్రార్థనా మందిరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు: క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబయ్యాయి. బుధవారం క్రిస్టియన్లు పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు చర్చీలను, ప్రార్థనాలయాలను నిర్వాహకులు ఇప్పటికే విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇందిరానగర్ సీఎస్‌ఐ ప్రార్థనా మందిరంతో పాటు ఎస్‌పీజీ పాలెం, ఏబీఎంపాలెం, కప్పలకుంట్ల, ఇందిరానగర్, సంగమేశ్వర సర్కిల్ తదితర కాలనీలతోపాటు అన్ని ప్రార్థనా మందిరాలను సుందరంగా అలంకరించారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ఆత్మకూరు పట్టణంలోని జి.పుల్లారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సాయిప్రణీత్ మాట్లాడుతూ శాంతికి, సంతోషానికి చిహ్నం క్రిస్మస్ పండగ అని, భారతదేశం మత సామరస్యానికి ప్రతీక అని చెప్పారు. చిన్నారులు క్రీస్తు జనన వృత్తాంతాన్ని చక్కగా ప్రదర్శించారు. చిన్నారులు మరియమ్మ, యేసేపు దేవదూతలు, జ్ఞానులు, మరియమ్మ వేషధారణలో అలరించారు. అనంతరం కేకు కట్ చేసి చిన్నారులకు పంచి పెట్టారు. చిన్నారులు వేసిన పలు వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి.



ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



నందికొట్కూరు: అలంకరణలో సీఎస్‌ఐ టౌన్ చర్చి



చర్చిపై ఏర్పాటు చేసిన నక్షత్రం



కొత్తపల్లె: సెమీ క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు

అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చాంద్‌బాషా పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



ముసలిమడుగులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ మహేష్ అన్నారు. మంగళవారం మండల మండల పరిధిలోని ముసలిమడుగు, శివపురం గామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో వేసిన పంటలను తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రీమియం చెల్లింపునకు ఈనెల 31వ తేదీ వరకు సమయం ఉందన్నారు. రబీ సీజన్‌లో మినుము, శనగ, ఉల్లి, జొన్న పంటలు సాగు చేసిన రైతులు ప్రీమియం కట్టి బీమా చేయించుకోవాలన్నారు. కంది పంటలో ఎండు తెగులు నివారణకు కాపరాక్స్ క్లోరైడ్ మందులు మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు. మినుములో రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడక్లోప్రిడ్ లేదా తయోమిథాగ్జామ్ లేదా అసిటామా ప్రైడ్ లేదా మెటాసిస్టాక్ మందులను పిచికారీ చేయాలన్నారు. పట్టుపరిశ్రమ శాఖాధికారి లింగమూర్తి, వీఏఏలు రవీంద్ర నాయక్, మౌనిక పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఆత్మకూరు: పట్టణంలోని అర్బన్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు షేక్ ఇస్మాయిల్, భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం అర్బన్ కాలనీవాసులతో కలిసి సీపీఎం నాయకులు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెంచు కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి కుళాయిలకు నీరు రావడం లేదన్నారు. పైపులు బ్లాక్ అయ్యాయని చెబుతున్నారన్నారు. వేసవి కాలం ప్రారంభం గాకముందే నీటి సమస్య నెలకొందని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శిలార్, కాలనీ వాసులు రాములమ్మ, సత్యమ్మ, వరలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, అబ్దుల్లా, నూర్, ఫక్రుబాషా, రమేష్, నూర్‌అహ్మద్, శేషఫణి, ఆలీ పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న ప్రజలు, సీపీఎం నాయకులు

పంటల బీమాతో అనేక ప్రయోజనాలు

జూపాడుబంగ్లా: పంటల బీమాతో అనేక ప్రయోజనాలు ఉంటాయని.. రైతుల సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పారుమంచాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు నిర్ణీత ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటనష్టం వాటిల్లితే నష్ట పరిహారం వర్తిస్తుందన్నారు. వరి పంట ఎకరాకు రూ.126, జొన్న ఎకరాకు రూ.59, మినుము -రూ.48, ఉల్లి -రూ.90, శనగ(పప్పుశనగ)-రూ.84, మామిడి ఎకరాకు రూ.2,250 చొప్పున ప్రీమియం మీసేవా, రైతుసేవా కేంద్రాల్లో డిసెంబర్ 31లోగా చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. అనంతరం శనగ పంటను పరిశీలించి చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.



శనగ సాగులో తీసుకోవాల్సిన మెలకువలను వివరిస్తున్న ఏఓ

27న విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనలు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచేది లేదని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే పెంచడమేమిటని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు కోకిల రమణారెడ్డి, నాగిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసన కార్యక్రమం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు విద్యుత్ బిల్లులు పెంచేదే లేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రజలపై విద్యుత్ చార్జీల మోత మోపిన చంద్రబాబుకు ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని చెప్పారు. చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈ నెల 27వ తేదీ నందికొట్కూరులో పోరుబాట జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జగదీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, కౌన్సిలర్ నాయబ్, పార్టీ నాయకులు మన్సూర్, శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ముచ్చుమర్రి నుంచి నీటి సరఫరా

పగిడ్యాల: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కేసీసీ లిఫ్ట్ ద్వారా కృష్ణా జలాలను కేసీ కాలువలోకి ఒక మోటర్ రన్ చేసి 240 క్యూసెక్కుల నీటిని మూడు రోజులుగా సరఫరా చేస్తున్నామని నీటిపారుదల శాఖ నందికొట్కూరు సెక్షన్ ఏఈఈ నరేష్ తెలిపారు. బుధవారం ఆయన సాక్షితో ఫోన్‌లో మాట్లాడుతూ.. సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాలువకు 6 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయన్నారు. అందులో తాగునీటికి 2 టీఎంసీలు, 4 టీఎంసీలు సాగునీటికి కేటాయించారన్నారు. అయితే సుంకేసుల రిజర్వాయర్‌కు ఇండెంట్ పెట్టలేదని వారబంధీ ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరి చివరి వరకు నీటి సరఫరా ఉంటుందన్నారు. రబీలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయన్నారు. సుంకేసులకు ఇండెంట్ పెట్టిన వెంటనే ముచ్చుమర్రి నుంచి నీటి సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

ఆత్మకూరు: రబీలో సాగుచేసిన పంటలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పంటల బీమా గడువు ఈనెల 31వ తేదీ వరకు ఉందన్నారు. రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మినుము పంటల్లో పల్లాకు తెగులు నివారణకు ఎకరాకు 6 నుంచి 10 పసుపు రంగు జిగురు అట్టలు అమర్చుకోవాలన్నారు. లేదా థయోమిథాగ్జామ్ లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. మినుములో బూడిద తెగులు నివారణకు అజాక్సిస్ట్రోబిన్ 500 ఎం.ఎల్. హెక్టారుకు పిచికారీ చేసుకోవాలన్నారు. రసాయనిక, పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమశాఖ అధికారి అరుణ పాల్గొన్నారు.

● **వెలుగోడు:** మండలంలోని మోత్కూరు, మాధవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ పవన్ కుమార్ మాట్లాడుతూ పంటలతోపాటు పాడి పశువులను కూడా పెంచుకోవాలన్నారు. రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సచివాలయంలో ప్రజలతో మాట్లాడారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడి ప్తి సారించాలని సూచించారు. తద్వారా పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు.



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

27న మండల సర్వసభ్య సమావేశం

జూపాడుబంగ్లా: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ మంగళవారం తెలిపారు. ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అన్నిశాఖల మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను పారబోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టానికి వ్యతిరేకంగా సారా తయారు చేయడం నేరమన్నారు. తయారు చేసినా, విక్రయించినా క్రిమినల్ కేసులతో పాటు వాహనాలు సీజ్ చేసి జైల్‌కు పంపడం ఖాయమని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, పద్మనాభం, పోలీసులు శివన్న, సుధీర్, కుమార్, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పొన్నాపురం కాలనీలోని ప్రత్యేక దత్తత కేంద్రంలో చిన్నారిని లాలిస్తున్న జిల్లా కలెక్టర్

నంద్యాల: కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కార్యాలయాల్లోని చుట్టుపక్కల ప్రదేశాలు దురాక్రమణలకు గురికాకుండా పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. పొన్నాపురం కాలనీలో ఉన్న డివిజనల్ పంచాయతీ కార్యాలయం, సచివాలయం–2, అంబేడ్కర్ భవన్, సాంఘిక సంక్షేమ కార్యాలయం, చంటి పిల్లల ప్రత్యేక దత్తత కేంద్రాలను పరిశీలిస్తూ సిబ్బంది, కార్యకలాపాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చంటి పిల్లల ప్రత్యేక దత్తత కేంద్రాన్ని చక్కగా, పరిశుభ్రంగా ఉంచుకున్నారని కలెక్టర్ ప్రశంసించారు.

●పూడికతో నిండిన కల్వర్టు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామంలో పూడికతో కల్వర్టు నిండిపోవటంతో మురుగునీరు తరచూ రోడ్డు పైకి చేరి ప్రజలకు ఇబ్బందిగా మారింది. గ్రామంలోని సొసైటీ బ్యాంక్ ఎదురుగా ఉన్న కల్వర్టు పూడికతో నిండి పోవడంతో పాటు, చెత్త, ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు అడ్డుపడటంతో మురుగు నీరు రోడ్డు పైకి ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

దుస్తుల పంపిణీ

ఆత్మకూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మొక్కజొన్నల వ్యాపారి కాటం ప్రశాంత్‌రాజు మంగళవారం వితంతువులు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్టియనుల క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు.



దుస్తులను అందజేస్తున్న వ్యాపారి ప్రశాంత్‌రాజు

పారిశుద్ధ్య కార్మికులకు..

చాగలమర్రి: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, వ్యాపార వేత్త చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం చక్రం కాంప్లెక్స్‌లోని తన కార్యాలయం వద్ద బట్టలు పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ప్రతి ఏడాది క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని స్థానిక పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న 20 మందికి దుస్తులు పంపిమీ చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. చాలీ చాలని చిన్న పాటి వేతనాలతో ఎన్నో ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకుంటున్న వారికి తమ వంతు సహాయంగా, పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో గత ఐదేళ్లుగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, వార్డు సభ్యుడు కె.అబ్దుల్లా, ఇలియాస్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభద్రమ్మ

పాములపాడు: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని వేంపెంట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు వివిధ సమస్యలపై 15 అర్జీలు అందజేశారు. అందులో 10 అర్జీలు ఆన్‌లైన్‌లో పొలం వివరాలు నమోదు చేయాలని, 5 అర్జీ లు సర్వే కోసం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఖాజాబీ, సర్వేయర్ కలిముల్లా, వీఆర్వోలు మాబాషా, శివన్న, రాము, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పురంధరుడు పాల్గొన్నారు.

భూసమస్యలపై అర్జీల స్వీకరణ

మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవె న్యూ సదస్సులో 15 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సు చక్కటి వేదిక అన్నారు. రైతులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

రెవెన్యూ సదస్సుకు 7 వినతులు

కొత్తపల్లి: మండల పరిధిలోని గోకవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 7 వినతులు వచ్చాయని తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. మండలంలో భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో 4 అర్జీలు భూమి కొలతలు, 3 ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని రైతుల నుంచి వినతులు వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.